ఆ నిరుపేదవాడు...


ఆకటిచిచ్చుకు తాళలేక ఆ రోడ్డుప్రక్కను పడి ప్రాణాలను విడిచిపెట్టేడు—.

పక్కనే పడివున్న కొన్ని చింకికాగితాలు గాలికి రెపరెప కొట్టుకుంటూ చెదిరిపోతున్నాయి...

ఆతృతతో వాటినితీసి నా దృష్టిని పోనిచ్చేను...—.

1...8...26...—.

"జీవితంలో కష్టమనేదికూడా వుందని తెలుసుకునే రోజు ఇది......సమాజాన్ని ఎదిరించేనన్న ఆక్రోశంతో స్వార్థసంఘం నన్ను వెలివేసింది... .. సమాజ గౌరవాన్ని నిలబెట్టాలనే ఆకాంక్షతో చిన్నప్పటినుండి పెంచిన తండ్రి, ఆత్మను చంపుకుని ...ప్రేమను ఛేదించి నన్ను ఇంట్లోంచిగెంటి వేసేడు...




స్వార్థ సమాజ పంజరంలో బంధింపబడిన పక్షికి స్వాతంత్ర్యసిద్ధి కలిగింది... ఆనందంతో, దేశయాత్రకై బయలుదేరేను... చేతిలో చిల్లిగవ్వలేదు ...అయినా కోరికను చంపుకోలేకపోయేను....

రాత్రి...చీకటిని చీల్చుకుంటూ శ్రీ కృష్ణ దేవాలయానికి దారితీసేను...తలదాచుకోటానికి నా దృష్టిలో అదే తగిన నెలవుగా...కనిపించింది...—

గుడిపూజారి పాకీపిల్లను తీసుకవచ్చి ఆ దేవాలయంలో...ఆ పవిత్రవిగ్రహం ఎదుట...తన తృష్ణా ప్రవృత్తిని సాగించి తనదారిని తను వెళ్లిపోయేడు...—.

ఆ దృశ్యం నన్ను ఓ పిచ్చివాణ్ణిగా చేసింది.

అనాథ మాలబాలికకు దెబ్బతగిలితే...ఆ రక్త ప్రవాహం చూడలేక...జాలిహృదయంతో... సేవ చేస్తే...అంటరానివారిని ముట్టుకున్నాననే నెపంతో సంఘం నన్ను బహిష్కరించింది...—.

కాని...తృష్ణాప్రపూర్ణుడై మాతృ సౌధానికి పునాదిరాయి అయిన శ్రీ కృష్ణాలయ గర్భగుడిలో మాలదానితో కూడి కూడనిఅవినీతికార్యం చేసిన ఆ స్వార్థ స్వయంపాక స్వామిని...ఆ సంఘమే ఆరాధించి పూజిస్తున్నాది...—.

ఇదేనా సంఘం...ఇదేనా సమాజ నిబంధన...???

ఈ ఆలోచనలతో...రాత్రి నాకు కునుకు పట్టలేదు—.

* * *

విచార హృదయంతో కాగితం తిరగవేసేను...—.

29...1...29...—.

"మానవజీవితం సమాజమనేగుదిబండకు కట్టబడి యున్నంతవరకు... స్వాతంత్ర్యమును కాని ... గౌరవంకాని పొందలేడనీ... వాంఛను ఛేదించలేడనీ... ఈ రోజు నాకు బాగా తెలియచేసింది...

నళినిని కలుసుకోటం...విడిపోటం...అంతా ఈ వేళనే జరిగింది...

నళిని పుట్టినది బ్రాహ్మణవంశం...—.

సమాజమనే కాలసర్పానికి చిక్కి బంధింపబడ్డ ఆమె తల్లితండ్రులు ఎనిమిది సంవత్సరాల ప్రాయంలోనే నళినిని...సంగతి గ్రహించకూడా వివాహపు యూప స్తంభానికి కట్టివేసేరు...—.

ముసలిభర్త ఏడాదిలోనే ప్రకృతిలో కలిసిపోయేడు...—.

సంఘ కట్టుబాట్లకు అతుక్కుపోయిన నళిని ...వసంతుని వలపుబాటలలో పూలపందిళ్లు చిత్రించుకుని జీవిత నౌకతో స్వర్గసీమాశ్రిత ప్రణయనదిలో విహరించి జీవితాన్ని ఓ మూడుమాసాలు ఆనందం జలధి చేసుకుంది. ఫలితంగా మాతృస్థానం ఆక్రమించుకోబోయింది...—.

పసికట్టిన సంఘం "కులట" అంటూ పంచల పాలు చేసింది...—, వసంతుడు సమాజాన్ని యెదిరించే తాహతులేక పందిలా కాలాన్ని పాడుచేసుకుంటూ తప్పుకున్నాడు...—.

భికారిణియై తిన తిండి ధరింప వస్త్రములేక కృశించిన దేహంతో విచారగ్రస్తయై...యీ రోజున...నాతో తన జీవితాన్ని తెలియచేసి...నా కళ్ళయెదుట...నన్ను దుఃఖజీవునిగా చేసి ప్రాణవాయువును అనంతవాయువులో విలీనం చేసింది....

చందాయెత్తిన డబ్బుతో ఆమె అంత్య సంస్కారం చేయటంతోనే ఈరోజు ముగిసింది...—.

* * *

మానవజీవిత సామరస్యాన్ని యథాతథంగా కనిపెట్టిన ఆ భికారి వాని ఆదర్శభావాన్ని మెచ్చుకుంటూ కాగితం తప్పించేను...—.

30...5...30...—.

"ఈరోజు...—"

కండ్లుతెరిచి చూసేసరికి...వైద్యశాలలో వున్నట్టు వాతావరణం తెలియచేసింది...—.

హృదయంలో ఏదో చెప్పలేని ఆవేదన... భరింపరాని బాధ...అంతా నామట్టుకు యమయాతనగా వుంది...అయినా ఒక ప్రయత్నంలోపడ్డ నా చెయ్యి ఆత్మను ప్రేరేపిస్తున్నాది...—.

జ్ఞాపకశక్తి నశించినా వున్నదాన్నికూడ తీసుకుని ఇది రాస్తున్నా—.

ఆ కారు శరవేగంతో వచ్చి బీచిదగ్గర ఆగింది...—.

వాడిన ముఖంతో...లోతుకుపోయిన కళ్ళతో...బక్కచిక్కిన శరీరంతో...పేలికలైన చింకిగుడ్డలతో...ఆకటి డొక్కతో...ఆ బీదభికారి... తొందర తొందరగ కారుదగ్గరకు పరిగెత్తేడు...—.

వణుకుతూన్న హస్తము చాపి ఆ శ్రీమంతుని యాచించేప్పటికి...ఆ ధనికస్వామి...హేయభావంలో దృష్టిని మరలించేడు—.

భికారి...ఇంకా అలాగే నుంచుని చూస్తున్నాడు...—.

సముద్రుడు హోరుమంటూ గర్జిస్తున్నాడు... కెరటాలు ఒకదానితో ఒకటి కొట్లాడుకుని భగ్నమైపోతున్నాయి...ఎర్రబారిన సూర్యుడు సముద్రగర్భంలో జారబడుతున్నాడు...వస్తూన్న ఓడ పొగ విరజిమ్ముతున్నాది...పాపం ఆ భికారికి ఇవేమీ ఆనందం కలిగించలేకపోయేయి—.

కాళ్లు గుంజెక్కేలా నిలుచున్నాడు కాని ఆకర్కశహృదయుడి చేతిలోంచి ఒక్కకానియేనా ఊడిరాలేదు..."బాబూ! దణ్ణం...బీదోణ్ణి... ఒక్కకానిడబ్బు దైచేయిండి...ధర్మాత్ములు..." ఇంకా ఏమిటేమిటో అంటున్నాడు...—.

అధికారి చేసంజ్ఞతో ప్రక్కనున్న జాగిలం "భౌ భౌ" మంటూ మీదపడింది...క్షణంలో బిచ్చగాడు భూమ్మీదకు ఒరిగిపోయాడు...—.

ఈ సన్నివేశం చూడగానే నా చిక్కిన శరీరంలో యింకా ఏమూలనో మిగిలివున్న రక్తబిందువులు ఉప్పొంగేయి...పక్కనేవున్న గుట్టలోంచి ఓ రాయితీసి జాగిలాన్ని కొట్టేసరికి...ఆ బూర్జువా నా బక్కచిక్కిన శరీరాన్ని.....కాలువులోకి తోసి...—.

ఇంతే జ్ఞాపకం.......

మళ్ళీ ఈరోజున ఇక్కడ కళ్లుతెరిచేను....—.

* * *

ఐక్యతాభావాన్ని అర్ధాకలితోకూడా చూపిన ఆ సమభావ దరిద్రనారాయణమూర్తిని నా హృదయకుసుమంలో తలుచుకుంటూ పేజీ వెట్టేను....

కొన్ని కాగితాలు శిథిలావస్థలో వున్నాయి. చదవడానికికూడా వీలుపడకుండావున్న ఆ పత్రాలలో ఏ విషాద జీవితాలను చిత్రించేదో...అవి అలానే...ఎందుకూ కొరగానివైపోయేయి...—.

పోగా మిగిలిన 'రెండుకాగితాలు పట్టుకున్నా....

26—9...32....

"కరడువారిని ఈ స్వార్థప్రపంచంలో నాకు స్థానంలేదని ఈరోజు గ్రహించేను...ఎక్కడో పర్సు పారేసుకున్న ఆ మూర్ఖుడు నేనే తీసేనంటు నన్ను జైలులోకి పంపేడు....

అధికారగర్వంతో నిండిపోయిన ప్రభుత్వాధికారులుగాని......భారతదేశాన్ని బానిసదేశంగా మార్చిన ప్రభుత్వంగాని...లంచాలాసించి కంగాళీ చేసి జేబులు నింపుకునే పోలీసువర్గంగాని...హింసాకాండను తృణప్రాయంగాచేసి తప్పించుకు తిరిగే ధనికవర్గంకాని...నా సత్యమయ జీవితగాథను విని ఆదరించలేకపోయేరు...స్వార్థం పెరిగిపోయిన ఈ సమాజవ్యక్తుల మధ్యపడి నలిగిపోయేకన్న...జైలు గోడల మధ్యనే శాంతిజీవితం గడపవచ్చునన్న...ఆనందంతో శిక్షాప్రకృతికి తలవగ్గి జైలుకుపోయిన రోజు ఈరోజు...."

కాగితం రెండోప్రక్క ఈలావుంది....

2...12...32....

"ఈ సర్వప్రపంచం ఓ బంధికానా...ఒకరి నొకరు బంధింప ప్రయత్నిస్తూ వుంటారు...ఆలోచిస్తే...అధికారిమొదలు బికారిదాకా అందరూ ఖైదీలే...బానిసత్వంలోపడిన దేశం...స్వార్థ వాతావరణలో పెరిగిన ప్రజలు ఈ సత్యాన్ని గమనించలేరు.

ఆ ఖైదులో...నా శరీరం పోలీసుల లాటీ దెబ్బలకు అలవాటుపడింది...నీటి మోతవల్ల బుజాలు కాయలు కాచేయి...ఆకటి చిచ్చువల్ల డొక్క లోతుకు దిగిపోయింది....

ప్రకృతిలోగల వింతమానవుల ప్రవర్తనా విధానం ఇక్కడ తెలుసుకోటానికి తగిన అవకాశం కుదిరింది....

ఈ నా జైలుజీవితంలో ఇంతకన్నా చెప్పతగ్గ విశేషం లేదు—.

రేపేనా విడుదల...."

* * *

ఆఖరు కాగితం చూసేను....

5...5...33....

"ఇది నా డైరీలో ఆఖరువ్రాత అనుకుంటున్నాను....

నేను దీన్ని నా అంతిమలేఖగానే భావిస్తున్నా....

జైలులోంచి వచ్చిందిమొదలు నేను పవిత్ర జీవితం గడుపుకుందామనే అభిప్రాయంతో అనేక మందిని ఆశ్రయించేను...అధికారస్వరంతో ఎదిరించేవారేగాని ఆదరించేవారు లేకపోయేరు....

జీవితంపై రోత జనించింది...ప్రకృతి ఆత్మహత్యకు ప్రేరేపిస్తున్నాది...విజ్ఞానం వారిస్తున్నాది ...ఆకలి మాడుస్తున్నాది....

గత్యంతరం కనుపించలేదు....

యాచకులు అనుభవిస్తున్న పరాభవం చూసేక మరి నాకు యాచించాలి అన్న అభిప్రాయం నాశనమైపోయింది...

నేను ఉపవాసంగా వుండి ఈ ఐదోరోజువరకు సరిగ్గా పదిరోజులు మరి నేను జీవిస్తాననే ఆశ ఎవరికీ వుండదు...నావల్ల దేశానికి ఉపకారం వుండదు...దేశంవల్ల నాకూ ఉపకారం లేదు....

ఎవరేనా దయాపరులు ఈ నా కాగితాలు చూడగలిగితే...వారు నా జీవితాన్ని ప్రపంచానికి తెలియజేయుమని కోరుతున్నా...."

* * *

నికృష్టమయకష్టజీవితమే విజ్ఞానానికి వివేకానికి ఆధారముగాని డిగ్రీలు...పరీక్షలు...కావని తెలియజేసిన ఆ బికారివాని జీవిత డైరీని జేబులో పెట్టుకుని...ఆ వికాస విజ్ఞాన ప్రపూర్ణుని మృతకళేబరానికి అంత్యక్రియలుచేసి నా సానుభూతిని తెలియజేసేను....

అంతే....